క్లుప్తంగా

ఏపీ మోడల్ స్కూల్‌లో డిజిటల్ మేళా

చీరాల అర్బన్: చీరాల మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్, సాప్, ఐటీసీ సహకారంతో కోడ్ ఉన్నతి అనే ప్రాజెక్టును సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు నేర్చుకున్న డిజిటల్ ఎడ్యుకేషన్ నుంచి నమూనాలను తయారు చేసి వాటిని కంప్యూటర్ ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వివరించారు. మేళాలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళ, కంప్యూటర్ ఉపాధ్యాయురాలు స్పందన, టీం లీడర్ శివ, పిఐఎఫ్ టీం మెంబర్స్, ప్రథమ్ ఇన్ఫోటెక్ స్టేట్ హెడ్ జి.లోకరాజు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వై.లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు యద్దనపూడిలో జగనన్నకు చెబుదాం

యద్దనపూడి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం రూపొందించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివసుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జిల్లాస్థాయి అధికారులు, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. అర్హులై ఉండి కూడా లబ్ధిపొందని ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

తహశీల్దార్‌గా కృష్ణప్రసాద్

జే.పంగులూరు: మండల తహశీల్దార్‌గా జీవీ కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. ప్రస్తుతం తహశీల్దార్‌గా పంగులూరు మండలం బదిలీయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిబ్బంది, ఎంఆర్‌ఓ కృష్ణప్రసాద్‌కు బొకే అందించారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

చీరాల: ఎలాంటి రసాయనాలు, క్రిమిసంహారక మందులు వాడకుండా పండించిన కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు అని చీరాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి అన్నారు. సోమవారం చీరాల తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ప్రతి సోమవారం స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ చీరాల డివిజన్ ఎంటీ భారతి, కవిత, నిరుపమ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామివారి వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న సమన్వయకర్త హనిమిరెడ్డి



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న హనిమిరెడ్డి

జే.పంగులూరు: మండల పరిధిలోని రామకూరు గ్రామంలో సోమవారం మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 2వ వార్షికోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించారు. గ్రామ నాయకులతో మాట్లాడి గ్రామ సమస్యలపై చర్చించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన శ్మశాన వాటికను కొందరు వ్యక్తులు దున్నేసి కలుపేసుకున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కబ్జాకు గురైన శ్మశాన వాటికను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, రామకూడు గ్రామ నాయకుడు అడ్డగడ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

యద్దనపూడి: మండలంలోని పోలూరు గ్రామంలో వేంచేసి ఉన్న భూ, నీళా సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గత నాలుగురోజులుగా అర్చకులు పరుచూరి శ్రీనివాసాచార్యులు, ప్రతిష్ఠాచార్యులు బృందావనం ఆదిత్య ఆధ్వర్యంలో 21 మంది వేదపండితులు శాస్త్రోక్తంగా పూజాకార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. సుమంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఉదయం 10.39 నిముషాలకు 40 అడుగుల ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, ఈఓ నాగయ్యలు హాజరై పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ధ్వజస్తంభ దాతలు కంభంపాటి నాగేశ్వరావు, వీరగంధం అనంత నారాయణ దంపతులను గ్రామస్తులు సత్కరించారు. అనంతరం భారీగా అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు చలపతాచార్యులు, ఫణీంద్ర, ఆంజనేయశర్మ, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



అలంకరణలో భూ,నీళా సమేత చెన్నకేశవస్వామి మూలవిరాట్



ధ్వజస్తంభ ప్రతిష్ట సందర్భంగా హాజరైన భక్తులు

మానవత్వం చాటుకున్న ఎస్సై

- క్యాన్సర్‌తో బాధపడుతున్న హోంగార్డుకు రూ.50 వేల ఆర్థికసాయం

చీమకుర్తి: బల్లికురవలో ఎస్సైగా పని చేస్తున్న నాగశివారెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తూ క్యాన్సర్‌తో బాధపడుతున్న కుమారికి సోమవారం చీమకుర్తిలోని ఆమె ఇంటికి వచ్చి రూ.50 వేల నగదు అందించారు. నాగశివారెడ్డి రెండు సంవత్సరాల క్రితం చీమకుర్తి ఎస్సైగా పనిచేశారు. ఆ సమయంలో హోంగార్డుగా కుమారి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. నాగశివారెడ్డికి స్థానిక పోలీసులు, కుమారి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.



హోంగార్డు కుమారికి నగదు అందిదిస్తున్న బల్లికురవ ఎస్సై

విజయసాయిరెడ్డి, వైవీని కలిసిన యడం బాలాజీ

చినగంజాం: వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వీ విజయసాయిరెడ్డిని సోమవారం సాయంత్రం పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న తరువాత తాడేపల్లిలోని కార్యాలయంలో కలిసి శాలువా కప్పి సత్కరించి అనంతరం కొద్దిసేపు ఆయనతో మాట్లాడారు. వారితో పాటు టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అనంతరం వారితో మాట్లాడారు.



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న యడం బాలాజీ

పార్టీ విజయానికి కృషి చేయాలి



యడం బాలాజీని కలిసిన పూనూరు నాయకులు

యద్దనపూడి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. నూతన సమన్వయకర్తగా ఎంపికైన యడం బాలాజీని చీరాలోని ఆయన స్వగృహంలో సోమవారం పూనూరు గ్రామానికి చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూనూరు గ్రామ సర్పంచ్ మేకా సుధాకర్, మండల యూత్ విభాగం అధ్యక్షుడు బొబ్బేపల్లి శ్రీకాంత్ , మేకా అక్కయ్య, కంచర్ల గోపయ్య, తిరుమలశెట్టి రామకృష్ణ, షేక్ బాజీ, గుడిపాటి సుబ్బారావు, కుంచపు అంకమ్మ, భూపతి, శ్యాంబాబు, దన్నవరపు పెద్దబ్బాయి, వంకాయలపాటి నాగయ్య, బొల్లా రత్నకుమారి తదితరులు ఉన్నారు.

కారంచేడు: వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీని నియోజకవర్గ ఏపీఎంల సంఘం సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. ఆయనను కలసిన వారిలో వైఎస్సార్ క్రాంతిపథం కారంచేడు, ఇంకొల్లు, పర్చూరు, చినగంజాం, బాపట్ల, సంతమాగులూరు మండలలాల ఏపీఎంలు మధుసూదనరావు, మోహనరావు, అంజిబాబు, లాజరులు ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన

మేదరమెట్ల: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో సమతావాణి అన్నారు. మండల కేంద్రమైన కొరిశపాడు మండల కార్యాలయంలో ఐటీసీ, సెర్ప్ సంస్థ సంయుక్తంగా మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యవస్థలో మార్పు వచ్చినప్పుడు తప్పకుండా ప్రజల్లో కూడా మార్పు రావాలని తద్వారా గ్రామాలన్నీ స్వచ్ఛమైన గ్రామాలుగా మారి ఆహ్లాదకరంగా రూపుదిద్దుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అలవాటు చేసుకోవడం వలన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు తద్వారా ఆదాయం పెంచుకునేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఈవోఆర్డీ ఓబులేసు, సెర్ప్ సీవో బుజ్జి,సీవో సతీష్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నియమాలు పాటిస్తే ప్రమాదాలు దూరం

చీరాల: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని చీరాల ఎంవీఐ బీ రామకృష్ణారెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం చీరాల ఎంవీఐ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారులపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపేసమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. నిబంధనలు పాటించకుండా ఓవర్‌టేక్ ప్రమాదకరమని వివరించారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణం చేయడం ప్రమాదకరమన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు 108 వాహనం వచ్చేలోపు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స ఏ విధంగా చేయాలో డాక్టర్ నరేంద్ర వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవీఐ రామకృష్ణారెడ్డి

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ అజెండా



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

- ఆర్బీకే, సచివాలయ నూతన భవనాల ప్రారంభం
- పల్లెపల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త చినహనిమిరెడ్డి

బల్లికురవ: ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా ఇచ్చిన హమీలన్నీ నెరవేర్చి సుపరిపాలన అందించటంల వల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిస్తున్న సిద్ధం సభలకు ప్రజలు పోటెత్తుతున్నారని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండంలోని గుంటుపల్లి, వల్లాపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. రూ.1.7 కోట్లతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ నిధులతో నిర్మించిన సైడ్ డ్రైన్స్, సీసీ రోడ్లు, మండల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను హనిమిరెడ్డి శిలాఫలకాల ఆవిష్కరణతో లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకె, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలనను అందుబాటులోకి తెచ్చిన ఘనత జగనన్నదే అన్నారు. వలంటీర్ వ్యవస్థతో అర్హతే ప్రామాణికంగా కులమత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. అద్దంకి ఎమ్మెల్యేగా తనను ఓటుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రెండు గ్రామాల్లో మేళతాళాలు, డప్పువాయిద్యాలు, టపాసులు కాల్చుతూ ప్రజలు హనిమిరెడ్డికి బ్రహ్మరథం పట్టారు. వల్లాపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పల్లె పల్లెకు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షులు ఐవీ సుబ్బారెడ్డి, బల్లికురవ, వల్లాపల్లి, కె. రాజుపాలెం సొసైటీల అధ్యక్షుడులు గుర్రం రంగారావు, మంచాల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు సుబ్బారావు, పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కే అంజనాప్రసాదరెడ్డి, సర్పంచ్‌లు మాదాల కృష్ణకుమారి, మందా మోహన్‌రావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఇప్పల అయ్యప్పరెడ్డి, ఏవో ఎస్‌వీపీ కుమారి, పంచాయతీరాజ్ ఏఈ జీ. హనుమంతరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు సీ శ్రీనివాసరావు, మాదాల నాగేశ్వరరావు, చల్లగుండ్ల సుబ్బారావు, షేక్ శ్రీనువలి, బీ గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

చీరాల: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు టువంటి విఘాతం కలుగకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఎస్.ప్రసాదరావు అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సోమవారం చీరాలలోని వీఆర్ఎస్‌వైఆర్ఎన్ ఇంజనీరింగ్ కాలేజీలోని ఆడిటోరియంలో చీరాల సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి సార్వత్రిక ఎన్నికల విధుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిష్పక్షపాతంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకునేలా శాంతిభద్రతలను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో చీరాల ఒన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు పి.శేషగిరిరావు, జి.సోమశేఖర్, ఎస్.సత్యనారాయణ, అద్దంకి టౌన్, రూరల్, ఇంకొల్లు సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.శివరామకృష్ణారెడ్డి, పి.కృష్ణయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరావు

విద్యార్థికి అభినందనలు

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈఈ మెరిట్ టెస్ట్‌లో ప్రతిభ కనపర్చి మొదటి ర్యాంక్ సాధించినట్లు హెచ్‌ఎం బీ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈనెల 8వ తేదీన నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్‌లో టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. హైస్కూల్‌ల్లో 7వ తరగతి చదువుతున్న బట్టా లలిత్‌సాయి విఘ్నేష్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడని తెలిపారు. ఈనెల 17న విజయవాడలో జరిగిన అభినందన సభలో విద్యాశాఖ కమిషనర్ ఎస్ సరేష్‌కుమార్ విద్యార్థి లలిత్ సాయికి రూ. 5 వేలు నగదు, ప్రశంస పత్రం, మెమొంటో అందజేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు బి వేణుగోపాల్, లలితా పరంజ్యోతి, నరశింహం, చైతన్య, శారద, మోహనరావు, నాగేశ్వ రరావు, వెంకటేశ్వర్లు అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రోటోకాల్ పొరపాటును సరిచేసిన అధికారులు

మార్టూరు: పొరపాటున గ్రామ సర్పంచ్ ప్రోటోకాల్ విషయంలో ఎదురైన సమస్యను సోమవారం అధికారులు పరిష్కరించారు. ఎంపీడీవో జి.నితిన్ వివరాల మేరకు.. మండలంలోని బొల్లాపల్లి, తాటివారిపాలెం రెండు గ్రామాలకు సంబంధించి బొల్లాపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే సెంటర్, హెల్త్ వెల్‌నెస్ క్లినిక్‌ల నిర్మాణం గత నెలలో పూర్తి చేశారు. ఈనెల 15వ తేదీ నూతన భవనాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆరోజు ఆవిష్కరించిన శిలాఫలకంలో గ్రామసర్పంచ్ నార్నె సింగారావు పేరును చేర్చిన అధికారులు పొరపాటున సమీప గ్రామమైన తాటివారిపాలెం గ్రామ సర్పంచ్ వైఎస్సార్ సీపీ నాయకుడైన చిలివేరి సుబ్బారావు పేరును శిలాఫలకంలో చేర్చలేదు. ఈక్రమంలో జరిగిన పొరపాటును గ్రహించిన అధికారులు నూతనంగా మరో శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి అందులో తాటివారిపాలెం సర్పంచి సుబ్బారావు పేరును చేర్పించి జరిగిన పొరపాటును సరిదిద్దినట్లు ఎంపీడీవో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అమ్మవారికి ఆభరణాలు అందజేత



అమ్మవారికి నూతన ఆభరణాలు అందిస్తున్న భక్తులు

చీరాల అర్బన్: పట్టణంలోని నల్లగాంధీబొమ్మ సెంటర్‌లో వేంచేసియున్న మహాలక్ష్మమ్మ అమ్మవారికి సోమవారం వెండి చీరతో కూడిన అమ్మవారి రూపము తొడుగు, బంగారు హారం , వెండి కలశం, బిందెలను భక్తులు సమర్పించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక అలంకరణలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంజీ శంకరరావు, చింతా రమేష్‌బాబు, ఎంఆర్‌కె మూర్తి, కొమ్మనబోయిన లక్ష్మణ, పల్లెల వాసుదేవరావు, యిండేటి వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

హనిమిరెడ్డి గెలుపు కోసం కృషి

అద్దంకి రూరల్: అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరక్టర్, అద్దంకి పట్టణ 11 వవార్డు ఇన్‌చార్జి కొల్లా భువనేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా పార్టీ మారిన వాళ్లకు మద్దతుగా ఉన్నానని, తనపై దుష్ప్రచారం జరుగుతుందని ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతానని వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పార్టీలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించారన్నారు.

లారీ, వరికోత యంత్రం ఢీ

అద్దంకి రూరల్: లారీ, వరికోత యంత్రం ఢీకొట్టుకోవడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన సోమవారం రాత్రి అద్దంకి శివారులో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నౌషద్, విజయ్‌లు వరికొత యంత్రాన్ని ఒంగోలు వైపునుంచి నల్లగొండ వైపు తీసుకువెళ్తున్నారు. ఈక్రమంలో వెనుక వస్తున్న లారీ, వరికోత యంత్రాన్ని దాటే క్రమంలో వరికోత యంత్రాన్ని ఢీకొట్టింది. దీంతో లారీ డ్రైవర్ వెంకటేశ్కు, మరొకరికి గాయాలయ్యాయి. వరికోత యంత్రం పైనున్న నౌషాద్‌కు, విజయ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.